# ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**చిన్నశంకరంపేట,జూన్ 5,ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధి పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన పరమేష్(35), కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంత కాలంగా పరమేష్ మద్యానికి బానిసై కూలి పనులకు వెళ్లేవారు వాడు కాదని, కుటుంబపోషణ భారమైందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని భార్య తెలిపింది. గత ఆదివారం భార్యభర్తలు గోడవ పడగా భార్య శంకరమ్మ తన పిల్లలను తిసుకోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రమేష్ బుధవారం వేకువజామున పట్టణ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి పది సంవత్సరాలలోపు ఉన్న ముగ్గురు కూతూళ్లు నికిత, వెన్నెల,రక్షితలు ఉన్నారు. మృతునికి కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తే నికిత నిర్వహించింది. భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్

**జహీరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్గోల్ గ్రామానికి చెందిన దిడ్గిబాయి లక్ష్మారెడ్డి (34)ను కిడ్నాప్‌కు యత్నించి దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు సిఐ రాజు తెలిపారు. బుదవారం పట్టణంలోని పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 4న జహీరాబాద్ ప్రాంతానికి చెందిన మహహ్మద్ ఖదీర్ (44), షేక్ ఇర్ఫాన్ (21), మహమ్మద్ అహ్మద్ (22), మహమ్మద్ జామీర్ పాషా (20)లతో పాటు మరి కొందరు అల్గోల్ గడ్డ వద్ద దిడ్గిబాయ లక్ష్మరెడ్డి (34)ను కిడ్నాప్ చేసి ఇనుప రాడుతో మెడపై కొట్టి హత్యాయత్నం చేస్తుండగా లక్ష్మారెడ్డి చాకచక్యంగా తప్పించుకుని తనపై జరిగిన హత్యాయత్నంపై పోలీసులకు ఫిర్యాదే చేశాడన్నారు. లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దాడి చేసి లక్ష్మారెడ్డిని గాయపర్చిన షేక్ ఇర్ఫాన్, మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ జామీర్ పాషాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడి చేసి హత్యాయత్నం చేసిన ఖదీర్ పరారీలో ఉన్నాడని సిఐ రవి వెల్లడించారు.



సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి పూలబొకేను అందజేస్తున్న సురేష్‌శెట్కార్

## సిఎంను కలిసిన జహీరాబాద్ ఎంపి

**నారాయణఖేడ్, జూన్ 5 ప్రభాతవార్త:** జహీరాబాద్ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున సురేష్‌శెట్కార్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌లను మార్యాద పూర్వకంగా కలిశారు. కాగా జహీరాబాద్ పార్లమెంట్ ఎంపిగా గెలుపొందడంతో సీఎం రేవంత్‌రెడ్డి సురేష్‌శెట్కార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జూక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు, జహీరాబాద్‌నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్‌శెట్కార్, పిసిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 8న చేప మందు పంపిణీ



చేప మందు

**నిజాంపేట(ఖేడ్), జూన్ 5 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఈనెల 8న మృగశిరకార్తే సందర్భంగా చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు పంపిణీదారులు తడకంటి పర్వాగౌడ్, లక్ష్మినారాయణగౌడ్, శంకర్‌గౌడ్, లింగాగౌడ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉబ్బసం, దగ్గు, దమ్ము వ్యాధితో బాధపడుతున్న వారికి చేప ప్రసాదం అందజేయడం జరుగుతుందని వారు వివరించారు. పూర్వీకుల నుంచి చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నందున పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో వస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## వనదుర్గామాతకు వెండి కిరీటం బహూకరణ



వెండికిరీటాన్ని బహూకరిస్తున్న అరవింద్ కుటుంబ సభ్యులు

**పాపన్నపేట, జూన్ 5, ప్రభాతవార్త:** మండలంలోని ఏడూపాయల్లో కొలువున్న వనదుర్గా భవాని మాతకు హైద్రాబాద్‌లోని వనస్థలిపురంకు చెందిన కానుగుల అవరింద్ కుటుంబ సభ్యులు బుధవారం 575 గ్రాముల, 68వేల రూపాయల విలువ గల వెండికిరీటాన్ని అందచేశారు. ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ఉద్యోగి ప్రతాప్‌రెడ్డికి కిరీటాన్ని అందించారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలి

### -డిఆర్‌డిఎ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ శ్రీనివాసరావు

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 5 ప్రభాతవార్త:** జిల్లాలోని పాఠశాలల్లోని విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు పాఠశాలలు ప్రారంభించే లోపు అనగా జూన్ 12వ తేదీలోపు అందించాలని ఏపీఎంలను డీఆర్డీఏ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్డీఏ కార్యాలయంలో ఏపీఎంలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం భారీగా కావలసిన క్లాత్ కట్ చేయించుకుని, కాజా బటన్లు వేయించుకొని ఎనిమిదో తేదీలోపు సంబంధిత హెడ్మాస్టర్లకు అందించాలని తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సరస్వతి, డీపీఎం మోహన్ కెనడి, ప్రకాష్, ఏపీఎం కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవిద్యాధరి క్షేత్రంలో కృత్తికా నక్షత్ర మహోత్సవం

**వర్గల్, జూన్ 5 (ప్రభాతవార్త):** వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలోని ఉప ఆలయం అయిన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి క్షేత్రంలో కృత్తికా నక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఉత్సవానికి అంకురార్పణ చేశారు. విశేష సంఖ్యలో హాజరైన భక్తులచే స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, పాటు మహా ప్రసాదం అందజేశారు.



శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

# అందరి సహకారంతోనే మండలాభివృద్ధి

◆ బీమాతో రైతులకు మేలు ◆ ఆగస్టుతో పూర్తికానున్న బీమా పథకం ◆ సర్వసభ్య సమావేశంలో ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, జూన్ 5 (ప్రభాతవార్త):** గడిచిన ఈ పదవి కాలం ఐదు సంవత్సరాలలో అందరి సహకారంతోనే మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్ళామని ఎంపిపి పాండుగౌడ్, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మండలకేంద్రం మర్కుక్ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎంపిపి పాండుగౌడ్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల అధికారులు ఎంపిపి అనుమతితో వారి శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. అనంతరం ఎంపిపి పాండుగౌడ్, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం హయాంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎన్నో రైతు సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా రైతు బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు లేదా మామూలుగా రైతు మృతిచెందినట్లయితే వారి కుటుంబానికి రూ.5 లక్షలు అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. మాజీ సిఎం కెసిఆర్ చేపట్టిన రైతు బీమా పథకం ఆగస్టు నెలతో పూర్తి అవుతుందని, తదుపరి కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. రైతులు బాగుండాలన్న ఉద్దేశ్యంతో ప్రాజెక్టులు నిర్మించి వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కెసిఆర్‌కే దక్కిందని తెలిపారు. ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. మేము బాధ్యతలు చేపట్టి ఐదు సంవత్సరాలలో అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్ళామని, ఈ పదవి కాలంలో ఎవరి మనసు నొప్పించినట్లయితే క్షమించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకారం, మండల ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ అబ్జలొద్దీన్, ఎంపిఓ లింగం, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యరేఖ, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎంపిటిసిలు నరేందర్, ధనలక్ష్మి, బాల్‌నర్సయ్య, మండల సూపరిండెంట్ ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్ నితేందర్, ఏఓ నాగేందర్‌రెడ్డి, ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ సుధీర్,ఇరిగేషన్ ఏఈ అభిలాష్, మిషన్ భగీరథ ఏఈ తిరుమల్‌రెడ్డి, పిఆర్ ఏఈ పాషా, అంగన్‌వాడీ మండల సూపర్వైజర్ దుబేరా, ఐకెపి సిసి కవిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి పాండుగౌడ్

# పర్యావరణాన్ని రక్షించుకుంటేనే భావితరాలకు మనుగడ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పర్యావరణాన్ని రక్షించుకుంటేనే భావితరాలకు మనుగడ ఉంటుందని కాంత్రి పాఠశాల డైరెక్టర్ భగవాన్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలోని క్రాంతి పాఠశాల, నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లాష్ మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్తాబాద్ చౌరస్తా కాంచిట్ చౌరస్తా, పాత బస్టాండు, బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో విద్యార్థులు నృత్య ప్రదర్శన ద్వారా పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని చూపరులను అకరిస్తూ, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేస్తూ మంచి సందేశాన్ని ఇచ్చారు. స్వచ్ఛ బడిని సందర్శించి ప్లాస్టిక్ వాడకం నిషేధంపై పర్యావరణ రక్షణపై అధికారులు అవగాహన కల్పించారు. నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ క్వాలిటీ కో-ఆర్డినేటర్ బేతి భాస్కర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగాన్ని మానుకోవాలన్నారు. చెట్లు మంచి అక్సిజన్ అరోగ్యాన్ని ఇస్తాయన్నారు. చెట్లు లేకపోతే మనపరిస్థితి ఏంటో అని అలోచించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి జీవికి చెట్లు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి జీవికి జీవనాధారం ప్రకృతి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పద్దతి అర్పిత, పాఠశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కరపత్రం అవిష్కరణ**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని క్రియేటీవ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారికార్యాలయంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం మానవాలితోపాటు ప్రాణకోటికే ప్రమాదం ఉంటుందని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్‌వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. అడవులు భూమతకు ఊపిరితిత్తులు అన్నారు. కార్యక్రమంలో క్రియేటీవ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లింగ శ్రీనివాస్, కోశాధికారి వెల్దండ మహిపాల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి భాస్కర్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నందిన భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ అధ్వర్యంలో...**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు కోమిటిచెరువు రూబీ నెక్లెస్ రోడ్డు వద్ద మార్నింగ్ వాకింగ్ చేసిన ప్రజలకు కూరగాయల మొక్కలను డాక్టర్ స్వామి అధ్వర్యంలో పంపిణీ చేశారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. ర్యాలీ నిర్వహించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

## అనారోగ్యంతో కడ్పల్ సొసైటీ చైర్మన్ మృతి

**సిర్గాపూర్, జూన్ 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడ్పల్ సొసైటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ఎండి జలీల్ (59) అనారోగ్యంతో మంగళవారం కానరాని లోకాలకు చేరిపోయారు. సిర్గాపూర్ గ్రామానికి చెందన ఎండి జలీల్ వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తిరిగిరాని లోకాలకు చేరిపోయాడని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. జలీల్ మృదేహానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సిడిసి మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, సిర్గాపూర్ ఎంపిటిసి సభ్యులు పీరప్ప, నాయకులు యాదవరెడ్డి, మహేశ్వర్ గుప్తాలు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

# భూయజమానులను బెదిరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు

**సంగారెడ్డి జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి**

**సంగారెడ్డి టౌన్, జూన్ 5, ప్రభాతవార్త:** చట్టాలను అతిక్రమించి ల్యాండ్ గ్రాబ్బింగ్‌కు పాల్పడినా, భూమి యజమానులకు బెదిరించిన, కిరాయి మనుషులతో భూమిలోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యంచేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి హెచ్చరించారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ జూన్ 26న అత్రియా స్మార్ట్ రియట్ కర్మాగారం కార్మికులు గణపతి రాజు శ్రవణ్ వర్మ, గుట్టుముక్కల భరత్‌వర్మ, పి.అశోక్‌రెడ్డి, పాషా, అఖిల్‌లు 10 మంది కిరాయి మనుషులను మునిపల్లి మండలం పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులో హైద్రాబాద్‌కు చెందిన పెండ్యాల బాబు, సర్వేనంబర్ 198, 251లోగల భూమిలోకి అక్రమంగా ప్రవేశించి మారణాయుధాలైన తల్వార్, కత్తులతో, కట్టెలతో పని చేస్తున్నవారిపై దౌర్జన్యంచేస్తూ అసభ్యంగా తిడుతూ దాడిచేయడానికి ప్రయత్నించి, చంపుతామని బెదిరంచి అక్కడనుంచి కూలీలను వెళ్లగొట్టి జేసిబి సహాయంతో భూమి చుట్టూ అమర్చిన సుమారు 800 ఫెన్సింగ్ కడీలను విరగ్గొట్టి నాశనం చేశారని సైట్ ఇంజనీర్, కూకట్‌పల్లికి చెందిన గడిపర్తి రవీందర్‌బాబు మునిపల్లి పోలీసుఠాణాలో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసిన మునిపల్లి పోలీసులు దర్యాప్తు చేయగా బంజారాహిల్స్, హైదరాబాద్‌కు చెందిన అత్రియా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్ రామక్రిష్ణ శ్రీనివాస్‌వర్మ పెండ్యాల హరినాథ్‌కు మునిపల్లి మండల పరిధిలో 100 ఎకరాల భూమి ఇప్పించి అభివృద్ధి చేయిస్తానని అందుకు రూ.30 కోట్లు తీసుకున్నాడన్నారు.

పెండ్యాల హరినాథ్‌బాబుకు కేవలం 70 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడని, 70 ఎకరాల్లో 10 ఎకరాల భూమిని డబుల్ రిజి స్ట్రేషన్ చేసినాడన్నారు.

సదరు భూమ విషయంలో ఇరువురు పలుమార్లు తగాదాలు చోటు చేసుకున్నా యన్నారు. పెండ్యాల హరినాథ్‌బాబుపై కక్ష పెంచు కున్న మంతెన రామక్రిష్ణవర్మ తన వద్ద పని చేస్తున్న గణపతిరాజు శ్రావణ్‌వర్మ, గట్టుముక్కల భరత్‌వర్మ, పి.అశోక్‌రెడ్డి, పాషాలు అఖిల్‌తో సంప్రదించి 10 మంది కిరాయి మనుషులను 3 లక్షల 50 వేల రూపాయల సుపారితో 15 రోజులకు మారణాయుధాలతో రప్పించుకుని భూమిలో కూలీ పనులుచేస్తున్న వారిని బెదిరించారన్నారు. నిందితులను అరెస్టుచేసి 4 సెల్ ఫోన్‌లు, తుఫాను వాహనం (ఎపి 29 వి 6891), జెసిబి వాహనం (టిఎస్ 15ఎఫ్ఈ 9295), ఒక కత్తి, 5 బాంబుస్టిక్‌లు స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పి చెన్నూరి రూపేష్ వివరించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి, పోలీసుల అదుపులో 10 మంది ల్యాండ్ గ్రాబ్బింగ్‌కు పాల్పడిన నిందితులు



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### -డిఎంహెచ్ఓ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

**వర్గల్, జూన్ 5 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం గౌరారం గ్రామంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని బుధవారం సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అకస్మిక తనిఖీ నిర్వహించారు. అవసరమైన సూచనలు అందించడంతో పాటు హెచ్‌బిఎన్‌సి కిట్టు ప్రాముఖ్యతను వైద్య సిబ్బందికి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్రంలో వండిన ఆహారంతో పాటు పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు, బాలింతలకు, తల్లులకు పాలు, బాలామృతంతో పాటు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. రానున్నది వర్షాకాలం కాబట్టి ప్రజలందరూ పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సిసి డేనియల్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ ఎ.మహతి, ఏఎన్ఎం మాణిక్యమ్మ, ఆశ వర్కర్లు బి.శ్రావణి, కె.లత, అంగన్వాడీ టీచర్లు సంతోష పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**చిన్నశంకరంపేట, జూన్ 5,ప్రభాతవార్త:** నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ బాబు తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ పట్టణంలోని 33 11కేవిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కామారం, చిన్నశంకరంపేట, పారిశ్రామికవాడ, రుద్రారం, చందంపేటలలో ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



పట్టుకున్న గుట్కాలను చూపుతున్న పోలీసులు

## గజ్వేల్‌లో నిషేధిత గుట్కాలు స్వాధీనం

**గజ్వేల్, జూన్ 5 (ప్రభాతవార్త):** ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు అంబర్, బ్లుబుల్, ఎడి, బ్లాక్ సిగరెట్స్ సుమారు ఒక లక్షా 20వేల విలువైన వాటిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గజ్వేల్ పట్టణానికి చెందిన గర్గ్ సచిన్ అగర్వాల్, ఇమ్మడి రవికుమార్‌లు ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు, గజ్వేల్ పోలీసులు కలిసి వారి కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించగా సుమారు లక్షా 20 వేల విలువైన గుట్కాలతో పాటు ఇతర నిషేధిత సిగరెట్స్‌ను స్వాధీనం చేసుకొని గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు మాట్లాడుతూ సిద్దిపేట సిపి అనురాధ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, జూదం, గ్యాంబ్లింగ్, గుట్కాలు అమ్మినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ఈలాంటి కార్యక్రమాలను ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667445, 8712667446, 8712667447 నెంబర్లక సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

## పిడుగుపాటుకు గేదె మృతి



**చౌటకూరు, జూన్ 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరాపల్లి గ్రామ శివారులో పిడుగుపాటుకు బర్రె మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం సాయంత్రం వేళలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తున్న తరుణంలో గ్రామానికి చెందిన కుమ్మరి ఆంజనేయులకు చెందిన బర్రె (గేదె) అడవిలో చెట్టుకు కట్టేసిన బర్రె పిడుగు పడటంతో బర్రె అక్కడికి అక్కడే మృతి చెందిందన్నారు.

## యువకుడు అదృశ్యం-వంతెనపై బైక్, చెప్పులు

**న్యాల్‌కల్, జూన్ 5, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఒక యువకుడు రాత్రికి ఎంతకూ తిరిగిరాకపోగా అతడి ద్విచక్ర వాహనం మంజీర వంతెనపై ఉన్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం... పోలీసు ఠాణా పరిధిలోని కాకిజనవాడ గ్రామానికి చెందిన బేగరి సదానందం(26) ట్రాక్టర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. మంగళవారం ఉదయం పనిమీద వెళుతున్నానని, మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తానని హోండా షైన్ (టిఎస్ 07జిబి 0751)పై వెళ్లాడన్నారు. మధ్యాహ్న భోజనానికి సదానందం ఇంటికి రాకపోవడంతో సాయంత్రం ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. పనిమీద ఉండొచ్చు అనుకుని రాత్రికి నిద్రకు ఉపక్రమించామన్నారు.బుధవారం ఉదయం గ్రామానికి చెందిన మాల విఠల్ బాదల్‌గావ్ నుంచి కాకిజనవాడకు వస్తున్న తరుణంలో సదానందం వాహనం మంజీర వంతెనపై ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా కుటుంబ సభ్యులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా సదానందంకు చెందిన వాహనం, చెప్పులతో పాటు ఆడవారు ధరించి చెప్పులు కనిపించాయన్నారు. అదృశ్యమైన సదానందం సోదరుడు బేగరి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాసం వాయిదా

**బోడుప్పల్, జూన్ 5 (ప్రభాతవార్త):** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిపై మెజారిటీ కార్పొరేటర్లు ప్రతిపాదించిన అవిశ్వాస ప్రత్యేక సమావేశాన్ని వాయిదా వేస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 6వ తేదీన పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మెజారిటీ కార్పొరేటర్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ నజిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. కార్పొరేటర్ల నోటీసును పరిశీలించిన కలెక్టర్ జూన్ 5వ తేదీన అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ గత నెల 18వ తేదీన కార్పొరేటర్లందరికి సమాచారం అంజేశారు. ఇందులో ముగ్గురు కార్పొరేటర్లు తమ సంతకాలను వేరే అవసరాల కోసం తీసుకొని దుర్వినియోగంన చేశారని జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. అదే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అవిశ్వాస ప్రత్యేక సమావేశాన్ని వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి ఎప్పుదు నిర్వహిస్తారనే విషయం పేర్కొనలేదు.

## హెల్మెట్లు పంపిణీ..వేగం కంటే దిశ ముఖ్యం..

**బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త**

వేగం కంటే ప్రయాణించే దిశ కూడా ముఖ్యమని,వాహనదారులు సరైన మార్గంలో ప్రయా ణించినట్లైతే ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జీ.శంకరరాజు అన్నారు. బుధవారం బేగంపేట టీటీఐ లో సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఏసీపీ చేతుల మీదుగా హెల్మెట్ల ను ఉచితంగా అందజేసారు.బుధవారం బేగంపే ట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్‌లో టీటీఐ,చెన్నైన్‌అమిత్ర ఇంటర్నేషనల్ ఇనిసిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ బల్కంపేట ఆధ్వర్యంలో విధ్యార్థులకు మరియూ ట్రాఫిక్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భం గా ఏసీపీ మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేసిన వారిపై కేసులు నమోదయ్యాయన్నారు.నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టి లో ఉంచుకొని ప్రతి ఒక్క వాహనదారుడు సుఖ వంతమైన ప్రయాణం సాగించాలని,ప్రతి ఒక్కరూ హెల్మెట్,సీటుబెల్ట్ ధరించి వాహనాలు నడపాలని ఆయన పిలుపు నిచ్చారు.ఆయాన్, శ్రీకృష్ణ,హీరో మోటార్స్ శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లకు వివిప్యాట్,ఈవిఎంల తరలింపు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**



పార్లమెంట్ ఎన్నికల అనంత రం జిల్లాలో నాలుగు నియోజ కవర్గాలకు సంబంధించిన వివి ప్యాట్‌లను స్థానిక తహసీల్దారు కార్యాలయం స్ట్రాంగ్ రూమ్‌లో బద్రపరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు.బుధవారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డితో కలిసి ఇవిఎంలను బద్రపరచిన ఏఏంసి గోడౌన్, తహసీల్దార్ కార్యాలయ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెం ట్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయిన సందర్భంగా వికారాబాద్,కొడంగల్,పరిగి ,తాండూరు నియోజ కవర్గాలకు సంబంధించి వికారాబాద్, కొడంగల్,పరిగి తాండూరు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు ఉపయోగించిన ఈవిఎంలు, కంట్రోల్ యూనిట్లు,బ్యాలట్ యూనిట్లను ఏఏంసి గోడౌన్‌లో బద్రపరచడం జరిగిందన్నారు.సంబంధిత రిజిస్టర్‌లలో సంతకాలు చేశారు.నిరంతర సిసి కెమెరాల పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్పిసిఇఒ సుధీర్,ఆర్‌డిఓ వాసుచంద్ర,తహసీల్దార్ లక్ష్మినారాయణ ఎన్నికల సిబ్బంది,తదితరులు ఉన్నారు.

# కంచుకోటలో కాంగ్రెస్ జెండా

-నాగర్‌కర్నూల్‌లో మెరిసిన హస్తం పార్టీ
-మూడుసార్లు గెలిచిన మల్లురవి
-16 పర్యాయయాల్లో 9సార్లు జయకేతనం

**ఆమనగల్లు, జూన్05, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి విజయకేతనం ఎగురవేసింది. ఆపార్టీ అభ్యర్థి మల్లు రవి విజయం సాధించారు. దీంతో మూడోసారి ఆయన పార్లమెంట్‌లో అడుగుపెట్ట నున్నారు. నాగరకర్నూల్ పార్లమెంట్ స్థానం (ఎస్సీ) కాంగ్రెస్‌కు కంచుకోటగా ఖ్యాతిగాంచింది. 1962 నుండి 2024వరకు 16సార్లు ఎన్నికలు జరగగా అందులో 9సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. అందులో మల్లు రవి 1991, 1998, 2024 ఎన్నికల్లో విజయం ధంకా మ్రోగించారు. ఈస్థానం నుండి మూడుసార్లు గెలుపొందిన మల్లు రవి ముచ్చటగా మూడోసారి పార్లమెంట్



విజయం సాధించిన తరువాత ముఖ్యమంత్రిని కలిసిన మల్లు రవి

మెట్లు ఎక్కనున్నారు. కాగా 1962 ఎన్నికల్లో (జె. రామేశ్వర్‌రావు), 1967లో (జే.బి. ముత్యాలు), 1977లో (ఎమ్. భీష్మాదేవ్) 1980లో ( మల్లు అనంతరాములు) 1989లో (మల్లు అనంత రాములు), 1991లో (మల్లు రవి), 1998లో( మల్లు రవి), 2014లో (నందిఎల్లయ్య), 2024 లో (మల్లు రవి)లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసి కాంగ్రెస్ కంచుకోటగా మార్చుకుంది. 1971 ఎన్నికల్లో ఎం.భీష్మాదేవ్ తెలంగాణ ప్రజా సమితి తరుపున గెలుపొందగా, తెలుగుదేశంపార్టీ తరపున 1984 వి.తులసీరాం, 1996, 1999, 2004లో మందజగన్నాథంలు విజయం సాధించారు. 2019లో పోతుగంటి రాములు బీఆర్‌ఎస్ పార్టీ తరపున గెలుపొందారు. కాగా 2019 ఎన్నికల్లో పోతుగంటి రాములు చేతిలో 1,89,748 ఓట్లతో పరాభవం పాలైన మల్లురవి, ప్రస్తుత ఎన్నికల్లో రాములు కొడుకు బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌పై 94414 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## పిడుగుపడి వ్యక్తి మృతి....

**షాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** పిడుగుపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధి లోని సంకేపల్లిగూడ గ్రామ సమీపంలో గల భారత్ గ్యాస్ గోదాం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.... చేవెళ్ల మండలం గుండాల గ్రామానికి చెందిన బేగరి వెంకటయ్య(45), తలారి నర్సింలు ఇద్దరు కలిసి బుధవారం ఉదయం షాద్‌నగర్‌కు పనినిమిత్తం వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో వర్షం వస్తుందని సంకేపల్లిగూడ గ్రామ సమీపంలో గల భారత్ గ్యాస్ గోదాం సమీపంలో చెట్టు కింద నిలబడ్డారు. ఒక్కసారిగా పిడుగు పడడంతో బేగరి వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తలారి నర్సింలు వెంకటయ్యకు సీపీఆర్ చేశాడు. అయినా ప్రయోజనం లేదు. దీంతో గ్రామస్థులకు ఫోన్ చేసి చెప్పాడు. గ్రామస్థులు, పోలీసులు వచ్చి ఇద్దరిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## విద్యార్థుల కోసం యూనిఫామ్స్ తయారు



.జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల కుట్టు శిక్షణ కేంద్రాల్లో విద్యార్థుల యూనిఫామ్స్ సిద్ధం చేస్తున్న దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫామ్స్‌ను మహిళా స్వయం సహాయక సంఘాల వారి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణకేంద్రాల్లో సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున త్వరగా దుస్తులను అందించటానికి జోరుగా కుట్టు కేంద్రాల్లో తయారు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించే దిశగ స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా దుస్తులు సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు డిఆర్‌డిఏ, మెప్మా, జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో గల ఆధీనంలో గల 507 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 89,565మంది విద్యార్థులకు జిల్లాలో గల స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందించటానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. పాఠశాలలు ప్రారంభించే 12వ తేదీలోపు కనీసం ఒక జత యూనిఫామ్ అందించాలని సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టారు. జిల్లాలో గల ఐదు గ్రామీణ మండలాలు,8మున్సిపాల్టీలు, జిహెచ్‌ఎంసి పరిధిలో గల 507 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయటానికి శ్రీకారం చుట్టినట్లు డిఆర్‌డిఓ సాంబశివరావు పేర్కొన్నారు. గ్రామీణ మండలంలో గల 125పాఠశాలల్లో 11,278 మంది విద్యార్థులకు, మున్సిపాల్టీల్లోని 117పాఠశాలల 9,921మంది విద్యార్థులకు, జిహెచ్‌ఎంసి పరిధిలో 265పాఠశాలల 28,330మందికి యూనిఫామ్స్ కుట్టించటం జరుగుతుందన్నారు. సంఘ సభ్యులను ప్రోత్సహించటానికి ప్రభుత్వం 50రూపాయలు నిర్ణయించినట్లు, దీనికి 25రూపాయలు జోడించి 75రూపాయలు చెల్లించటానికి నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. జిల్లాలో ఐదుగురు డిపిఎంలు,ఎపిఎంలు పర్యవేక్షిస్తున్నారు. మహిళలను ఇక పారిశ్రామిక వేత్తలుగ మార్చటానికి ప్రభుత్వం యూనిఫామ్స్ తయారు కోసం మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించిందన్నారు. బ్యాంకులు శ్రీనిధి ద్వారా రుణాలు అందించి పర్మినెంట్ కేంద్రాలు నిర్వహించే దిశగ తగు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్‌డిఓ సాంబశివరావు తెలిపారు. డిఇఓ విజయకుమారి డిఆర్‌డిఎ ద్వారా మహిళలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. జిల్లాలో విద్యార్థుల యూనిఫామ్స్ తయారుకు కుట్టు కేంద్రాల్లో మహిళలు ఉత్సాహంగ పాల్గొంటున్నారు.

## విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5, ప్రభాత వార్త:** విద్యుత్ షాక్‌తగిలి పాడిఆవు మృత్యువాత పడిన సంఘటన పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో బుధవారం చోటుచేసుకుంది. ఇస్మాయిల్ ఖాన్‌గూడ గ్రామానికి చెందిన బీర్ల బాలమల్లేశ్ తన పాడి ఆవును మేత కొరకు తన పొలంలో వదలిపెట్టగా అప్పటికే విద్యుత్



స్మాయిల్ ఖాన్‌గూడలో విద్యుత్‌తీగలు తగిలిషాక్‌కొట్టి మృత్యువాత పడిన ఆవు దృశ్యం.

తీగలు స్థంభం నుండి తెగిపడినే లపై పడి ఉండటంతో పొలంలోకి వెళ్లిన ఆవుకాళ్లకు విద్యుత్‌వైరు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు బాలమల్లేశ్ తెలిపారు. మృతి చెందిన పాడిఆవు విలువ దాదాపు 90 వేల రూపాయలుంటుందని పాడిరైతు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడిఆవు మృ త్యువాత పడిందని అన్నారు. విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడిఆవు మృతితో నష్టపోయిన పాడిరైతుకు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న ఎంపిపి సుకన్య భాష, ఎంపిడివో నరేందర్ రెడ్డి,ఉపాధి హామీ కూలీలు



మొక్కలు నాటిన నేలతల్లి అధ్యక్షులు చంటి



మొక్కలు నాటుతున్న మాజీ చైర్‌పర్సన్, అధికారులు

**యాచారం జూన్5,ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఎంపిడివో నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో యాచారం మండల పరిధిలోని మల్కిన్ గూడ,నందివనపర్తి,యాచారం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఎంపిపి సుకన్య పాల్గొని మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రకృతిని దైవంలా కోలిసే మన సాంప్రదాయంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దేరంగుల శారద శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్ మండలంలో..**

**కడ్తాల్, జూన్ 05 ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేలతల్లి అధ్యక్షులు చంటి ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. పర్యావరణం బాగుంటేనే ప్రజలందరు క్షేమంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరి, మౌనిక, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు మండలంలో..**

**తాండూరు, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని తాండూరు పట్టణ శివారులోని ఖాంజాపూర్ గేట్ సమీపంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణం, మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ స్కూల్లో మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, తాండూరు పారెస్ట్ ఆఫీసర్ శ్యాం సుందర్ రావుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణం పచ్చగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ కేవీఎం వెంకట్, శ్రీరామ కృష్ణ సేవాసమితి గౌరవాధ్యక్షులు గాజుల బస్వరాజ్, రిటైర్డ్ హెచ్‌ఎం బిచ్చప్ప బీట్ ఆఫీసర్ మల్లప్ప, పాటశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గీతామందిర్‌లో కొనసాగుతున్న హరేరామనామ సప్తాహం

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో పరమహంస పరివ్రాజకాచార్య పూజ్య శ్రీఅవధూతేంద్ర సరస్వతీ స్వామి 49వ పుణ్య ఆరాధన మహోత్సవంలో భాగంగా హరేరామ నామ సంకీర్తన సాప్తాహం నిర్వహిస్తున్నారు. శ్రీసదానంద యోగీశ్వరుల అధ్యక్షతన ఈనెల 1 నుంచి నిత్యం హరేరామ నామ సప్తాహం పూజ, భజన కార్యక్రమాలు జరుగుతున్నాయి. 108 హనుమాన్ చాలీసా పారాయణం, హరేరామ నామ సప్తాహం ఈనెల 7 వరకు కొనసాగుతుది. ఈనెల 8న స్వామి ఆరాధన పూజ, 9న హరేరామ నామ సప్తాహం ముగింపు, మంగళహరతీ జరుగుతుందని శ్రీమద్భగవద్గీత భక్త సమాజం నిర్వహకులు తెలిపారు. ఈసందర్భంగా గీతామందిర్‌లో నిత్యం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొనాలని కోరారు.

## ఈటల గెలుపుపై ఎంపిపి హర్షం..సన్మానం



ఎంపీగా ఎన్నికైన రాజేందర్‌ను సన్మానిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందడంతో ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా ఆయన నివాసానికి వెళ్లి ఈటల రాజేందర్‌ను కలిసి పూలదండ వేసి శాలువాతో సన్మానించారు. బాణాసంచా కాల్చి కార్యకర్తలకు మిఠాయిలు తినిపించారు. మల్కాజ్‌గిరిలో బిజెపి గెలుపుకోసం కష్టపడి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మల్కాజ్‌గిరి ఓటర్లు ధర్మం వైపు నిలబడి ఓటు వేసి కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి పీఎం మోదీ నాయకత్వాన్ని మరోసారి కోరుకున్నారని ఎంపిపి పేర్కొన్నారు.

## నాడు ప్రశ్నించే గొంతుగా మల్కాజ్‌గిరి ఎంపిగా సిఎం రేవంత్‌రెడ్డి

- నేడు ప్రశ్నించే గొంతుగా మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ గెలుపు
-మేడ్చల్ జిల్లా బిజెపి శ్రేణుల్లో జోష్ నిచ్చిన మల్కాజ్‌గిరి ఎంపి ఫలితాలు
-కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలను కలవరపెట్టిన ఎన్నికల ఫలితాలు
-స్థానిక సంస్థలకు మరింత బలోపేతం కానున్న జిల్లా బిజెపి నాయకత్వం



మేడ్చల్ జిల్లాలో మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ గెలుపొందటంతో ఉత్సాహంలో బిజెపి శ్రేణులు

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి),జూన్ 5, ప్రభాతవార్త**

గత ఐదేళ్ల క్రితం జరిగిన ఎంపి ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుగా కాంగ్రెస్ నుంచి మల్కాజ్‌గిరి ఎంపిగా (సిఎం) ఎ.రేవంత్‌రెడ్డి గెలుపొందగ, ఈ ఎన్నికల్లో అదే తరహాల్లో బిజెపి నుంచి మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందటం చర్చనీయాంశంగ మారింది. మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు ఐదేళ్ల కోసారి మార్పును కోరుకోవటం ప్రాధాన్యతను సంతరించుకుందని చెప్పవచ్చు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల ఫలితాలు బిజెపి శ్రేణులను ఉత్సాహంతో పాటు మరింత జోష్‌ని నింపిందని చెప్పవచ్చు. బిజెపి నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహంతో పాటు పార్టీ భవిషత్‌కు మరింత ఊరట లభించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మల్కాజ్‌గిరి ఎంపిగా బిజెపి నుంచి ఈటల రాజేందర్ గెలుపొందటం చర్చనీయాంశంగ మారింది. అయితే మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపుతో మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ 3,91,475ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రతి రౌండ్‌లోనూ మొదటి రౌండ్ నుంచి 21చివరి రౌండ్ వరకు కూడ బిజెపి అధిక్యత సాధించటం విశేషంగ చెప్పవచ్చు. మల్కాజ్‌గిరి ఎంపి పరిధిలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బినగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల మెజార్టీ ఓటర్లు ఎంపిగా ఈటల రాజేందర్ బిజెపికి పట్టం కట్టారు. ఓట్ల లెక్కింపులో మొదటి స్థానంలో బిజెపి, రెండో స్థానంలో కాంగ్రెస్, మూడవ స్థానంలో బిఆర్‌ఎస్ అభ్యర్థులు నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు మరో సారి ప్రశ్నించే గొంతుగా ఉంటారన్న భావంతో బిజెపి నుంచి ఈటల రాజేందర్‌ను ఎంపిగా గెలిపించి ఉంటారని పలువురు భావిస్తున్నారు. గతంలోనూ 2019లో ఎంపి ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండటంతో మల్కాజ్‌గిరి ఎంపిగా రేవంత్‌రెడ్డిని (కాంగ్రెస్) నియోజకవర్గ ప్రజలు ప్రశ్నించే గొంతుగా గెలిపించిన సంగతి తెలిసిందే. అదే తంతులో నాడు తెలంగాణలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటే ఎంపిగా కాంగ్రెస్‌ను గెలిపించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు బిజెపిని గెలిపించారని ప్రశ్నించే గొంతు తరహాలోనే ఈటల రాజేందర్‌ను ఎంపిగా గెలిపించారని పలువురు భావిస్తున్నారు. అదే విధంగ కేంద్రంలో నరేంద్ర మోదీని చూడటంతో పాటు అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి కూడ ఆయనకు బిజెపికి కలిసి వచ్చిందని పలువురు భావిస్తున్నారు. తెలంగాణలో ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సమానంగా బిజెపి ఎంపి సీట్లు రాణించటం రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగ మారింది. అయితే బిఆర్‌ఎస్ ఓట్లు ఎక్కువగా బిజెపికి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు కూడ ఈ విషయం చర్చనీయాంశంగ మారింది. ఇక మల్కాజ్‌గిరి బిజెపి అడ్డగ మారనుందని బిజెపి శ్రేణులు భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీల నుంచి కూడ కొంత మేరకు బిజెపికి క్రాస్ ఓటింగ్ జరిగి ఉంటుందని అందుకే భారీ మెజార్టీ ఈటల రాజేందర్‌కు వచ్చిందని, గతంలో తెలంగాణలో ఈటల రాజేందర్ రెండుసార్లు మంత్రిగా, తెలంగాణ ఉద్యమనాయకునిగా రాణించటంతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో రెండు చోట్ల బిజెపి నుంచి పోటీ చేసి ఓటమిని చవి చూశారని, గతంలో ఐదేళ్ల కిందట కొడంగల్‌లో నాడు ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓటమిని చవి చూస్తే మరో మూడు నెలల్లోనే మల్కాజ్‌గిరి ఎంపి నియోజకవర్గ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ నుంచి ప్రశ్నించే గొంతుగా ఎంపిగా రేవంత్‌రెడ్డిని గెలిపించిన సంగతి కూడ తెలిసిందే. అదే తరహాలో మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్‌ను బిజెపి నుంచి గెలిపించారని అంటున్నారు. మల్కాజ్‌గిరి ఎంపిగా ఈటల రాజేందర్ బిజెపి నుంచి గెలుపొందటంతో ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి మరింత బలోపేతం అయి నాయకత్వం పెరగవచ్చని పలువురు భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల్లో బిజెపి నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించటం బిజెపి శ్రేణుల్లో మరింత జోష్ నింపిందని చెప్పవచ్చు. వివిధ నియోజకవర్గాల్లోనూ బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు.

# నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరుకు చర్యలు

-జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

**కొడంగల్,జూన్ 5ప్రభాతవార్త**

పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి సరైన దిగుబడి రాక నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ హామీ ఇచ్చారు.బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో నష్టపోయిన రైతులతో జేడీ మాట్లాడారు. వరి విత్తనాలు తయారు చేసిన కంపెనీ వారితో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామన్నారు.ఎకరాకు వంద బస్తాలు దిగుబడి వస్తాయనే నమ్మకంతో కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు.ఆశించిన మేర దిగుబడి రాక నష్టం జరిగిందని రైతులు జేడీఏ దృష్టికి తీసుకువచ్చారు.విత్తనాల విషయంలో విచారణ జరిపి సదురు కంపెనీపై చర్యలు తీసుకుంటామని జేడీఏ గోపాల్ తెలిపారు.క్షేత్రస్థాయిలో పరిశీలించి జూన్ 15న రైతులతో మళ్ళీ సమావేశం ఏర్పాటు చేసి పరిహారం ఎంత ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయిస్తామన్నారు. జిల్లాలో ఎవరైనా దుకాణదారులు నకిలీ విత్తనాలు,నాసిరకం విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలు విక్రయిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీఏ గోపాల్

హెచ్చరించారు.రైతులకు అండగా ఉంటూ ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు రైతుల పక్షాన మాట్లాడుతు రెక్కాడితే కాని డొక్కాడని రైతులకు న్యాయం చేయాలని కోరారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారం భం అవుతున్నందున రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా త్వరలో సమస్యను పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఓలా వణ్య తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో తీవ్ర గాయాలైన జింక

**బంట్వారం, జూన్ 5 ప్రభాతవార్త:** కుక్కల దాడిలో ఓ జింక తీవ్రగాయలైన సంఘటన మండల సరిహద్దు గ్రామమైన బొపునారం-కుంచావరం గ్రామ సరిహద్దులో చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బొప్పునారం గ్రామ శివారులోని కుంచావరం గొల్ల రామచంద్రి మొక్కజొన్న పొలంలో జింక ను చుట్టుముట్టి కుక్కలు దాడి చేస్తుండగా రైతు గమనించి వాటిని తరిమివేశారు. దీంతో జింక అప్పటికే తీవ్రగాయమై బొపునారం వైపు పరుగు పెట్టింది. ఎలాగో దాన్ని కొంతమంది రైతులు కలిసి పట్టుకొని అక్కడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. దీంతో వారు గాయాలైన జింక ు కుంచవరం పశువుల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భా నుప్రతాప్ ను వివరణ కోరగా సుమారు రెండున్నర సంవత్సరాలు వయసున్న ఈ జింక అటవీ ప్రాంతం నుండి పంట



తీవ్ర గాయాలైన జింకను పరిశీలిస్తున్నా పారెస్ట్ అధికారులు

పొలాలకు వచ్చినట్టు తెలిసిందని చెప్పారు. అయితే సరిహద్దులోని తట్టేపల్లి, బొప్పు నారం మగ్దంపూర్ అటవి పరిసరాల నుండి ఇక్కడికి వచ్చి ఉంటుందన్నారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని విచారిం చామని ఆయన తెలియజేశారు. చికిత్స అనంతరం జింకను గుల్బర్గా జూ పార్కుకు తరలిస్తామని ఆయన తెలియజేశారు.



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**జహీరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్‌లోని కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ మండల కమిటీ చైర్మన్ కె.సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి అనూష కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మాణెన్న, న్యావాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

**రాయిపల్లిలో...**



ప్రపంచ పర్యావరణ దినోత్సవంను జరుపుకుంటున్న దృశ్యం

**మనూర్, జూన్ 5, ప్రభాతవార్త:** మండలంలోని రాయిపల్లిలో బుధవారం ఎస్‌బిఐ ఫౌండేషన్, భవిష్య భారత్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వైటిసి కేంద్రంవద్ద ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద మొక్కలు నాటారు. భవిష్య భారత్ సభ్యులు జహంగీర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ఎస్‌బిఐ ఫౌండేషన్ సహకారంతో గ్రామ సేవా కార్యక్రమం ద్వారా అనేక పనులను చేయడం జరిగిందని, అందులో పర్యావరణానికి సంబంధించి 2 చెక్ డ్యాంల నిర్మాణం చేశామన్నారు. 5 గ్రామాల పంచాయితీ సభ్యులతో కలసి 5వేల మొక్కలు, సీడ్ బాల్స్ నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భవిష్య భారత్ సభ్యులు ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బోరంచ నల్లపోచమ్మ ఆలయ ఇఒగా శివరుద్రప్ప



బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఈఓ శివరుద్రప్ప

**మనూర్, జూన్ 5, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో కొలవై ఉన్న శ్రీనల్లపోచమ్మ ఆలయ ఈఓగా శివరుద్రప్ప బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈఓగా బాధ్యతలు స్వీకరించి శిరుద్రప్ప ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఓగా బాధ్యతలు స్వీకరించిన శివరుద్రప్పకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు చేసి శాలవాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి సిద్దుస్వామి, నాగయ్యస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిగా నెనావత్ శంకర్

**పుల్కల్, జూన్ 5, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన డి.అంజయ్య మే 31న పదవీ విరమణ పొందడటంతో నెనావత్ శంకర్‌ను మండల విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. కోహీర్ మండల విద్యాధికారిగా, ఆత్మకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న నెనావత్ శంకర్‌ను (9948888502) పుల్‌కల్, చౌటకూరు మండలాల విద్యాధికారిగా బదిలీ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

## రఘునందన్‌రావును కలిసిన బిజెపి నాయకులు



రఘునందన్‌రావును సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**రాయపోల్ జూన్ 5, ప్రభాతవార్త :** మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆయనను బుధవారం మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు, బిజెపి నాయకులు సత్యపాల్‌రెడ్డి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలలో రఘునందన్‌రావు మెదక్ ఎంపీగా గెలుపోందడంతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకంక్షాలు తెలియజేశామన్నారు. ఎంపీని కలిసిన వారిలో బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం

### నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్

**హుస్నాబాద్, జూన్ 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ బత్తుల శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో గెలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్న సందర్భంగా బుధవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులతో కలసి బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ప్రజలు అరాచక పాలనకు స్వస్తిపలికి టిడిపి, జనసేన, బిజెపి కూటమిలకు అధికారం కట్టబెట్టారన్నారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు నాలుగవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారన్నారు. ఇక రానున్న రోజుల్లో పార్టీకి మంచి రోజులు వస్తున్నాయని తెలంగాణలో సైతం పార్టీకి మరల పూర్వవైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల శంకర్, ఎండి హస్సన్ ఆకుల వెంకటేష్, వరికోలు రవిందర్, నర్సా రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు



# రైతులను కన్నీరు పెట్టిస్తున్న అధికారులు

- పట్టించుకోని జిల్లా అధికారులు
- ఆందోళనకు దిగనున్న రైతులు

**అల్లాదుర్గం, జూన్ 5, ప్రభాతవార్త:**

జొన్నల కొనుగోలు కేంద్రం మూసివేయడంతో రైతులు కన్నీరు కారుస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లగా టోకెన్లు ఇచ్చి రేపు మాపు అంటూ కాలయాన చేసి ఇప్పుడు కొనుగోలు చేయమని చేతులు ఎత్తేయడంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని సొసైటీ అధికారులకు వినతిచేస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జొన్నలు కొనుగోలు చేయడం లేదని రైతులు సంబంధిత అధికారులు, జిల్లా ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లగా కొనుగోలు కేంద్రానికి తెచ్చిన జొన్నలు మధ్యాహ్నం వరకు కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చినా సాయంత్రమైనా కొనుగోలు చేయడం లేదని రైతులు లబోదిబో మంటున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

రైతుల నుంచి జొన్నల ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే గురువారం రెవెన్యూ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు. రైతుల వద్ద జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే గురువారం రైతులు నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తామని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నరసింహులు పేర్కొన్నారు.



బండి గెలుపుతో సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

## బండి గెలుపుతో బిజెపి నాయకుల హర్షం

**హుస్నాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్‌కుమార్ గెలుపొందడం పట్ల బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమట్‌రెడ్డి రాంగోపాల్‌రెడ్డి టపాసులు కాల్సి సంబరాలు జరుపుకున్నారు. అంతకు ముందు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్‌కి ప్రజలు రెండు లక్షల పై చిలుకు మెజారిటీ ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ గెలుపుతో పార్టీకి బాద్యత పెరిగిందని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, నాయకులు లక్కిరెడ్డి తిరుమల, మాజీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, మాజీ అక్కన్నపేట మండల అధ్యక్షులు గొలపల్లి వీరాచారి, బద్దిపడగ జైపాల్‌రెడ్డి, గుత్తికొండ విద్యాసాగర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో...**

మండలంలోని మల్చేరుతండాలో గిరిజన మోర్చ మాజీ మండల అధ్యక్షులు బానోతు అనీల్ నాయక్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్ భారీ మెజారిటీతో గెలిసి రెండవ సారి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలసి బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బండి సంజయ్‌కి ఓటు వేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలలోనే సాధ్యం

**చిన్నశంకరంపేట, జూన్ 5, ప్రభాతవార్త:** నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలలో సాధ్యమవుతుందని ప్రిన్సిపల్ నాగేందర్ తెలిపారు. బుధవారం నాడు పట్టణంలో పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లి, తండ్రులతో మాట్లాడి కళాశాల ప్రాముఖ్యతపై వారికి వివరించారు. ప్రభుత్వ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ నాగేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ ఉచిత విద్యను, క్రమశిక్షణతో అందించడం జరుగుతుందన్నారు. ఇటువంటి సౌకర్యాన్ని చిన్నశంకరంపేట మండల పరిసర ప్రాంతాల 10వ తరగతి పూర్తి అయిన విద్యార్థులు అందిపుచ్చుకొని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో ఉమ్మడి మెదక్ జిల్లాలోనే చిన్నశంకరంపేట మొదటి స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలిచిందన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరంకు అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. జనరల్ గ్రూపులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపులలో ఓఎ, ఏ అండ్ టీ, సీఎస్ కోర్సులు, ఇంగ్లిష్, తెలుగు మాద్యమంలో బోదించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తులు ఇచ్చిన వెంటనే అడ్మిషన్లు ధృవీకరించి ఇస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగేందర్



ఎస్ఐ మహమ్మద్ గౌస్‌ను సన్మానిస్తున్న ప్రభాకర్‌గుప్త, పుర్ర ప్రభాకర్, పద్మయ్య

## ఉత్తమ సేవాపతకం అందుకున్న ఎస్ఐకు సన్మానం

**కొల్చారం, జూన్ 5 ప్రభాతవార్త:**

తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కొల్చారం మండల ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఉత్తమ సేవ పతకం అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజాంపురం ప్రభాకర్‌గుప్త, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, సంగాయిపేట మాజీ సర్పంచి పద్మయ్య ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, జూన్ 5 ప్రభాతవార్త:** మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని శేరిలా గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు, తలిదండ్రులతో కలిసి బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా ఆరోగ్యకరమైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందన్నారు. పిల్లలకు ఆట వస్తువులతోపాటు ఆడించడం జరుగుతుందని, దీని ద్వారా వారి మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. చిన్నారులకు మెరుగైన ఆరోగ్యం, మంచి విద్యతో వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఆరు నెలల నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు దేవలత, లక్ష్మి, ఎంపీహెచ్‌వో కృష్ణవేణి, ఏఎన్ఎం స్రవంతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్‌కు సన్మానం

**సిద్దిపేట రూరల్, జూన్ 5, ప్రభాతవార్త :** పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ ఎంపిగా విజయం సాధించిన సురేష్ షెట్కార్‌ను సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరకుల శివప్ప బుధవారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పాటు కేంద్ర నిధులతో ఎంపి సురేష్ షెట్కార్ నేతృత్వంలో జహీరాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.



జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న శివప్ప

# బిజెపితో బిఆర్ఎస్ పార్టీ కుమ్మక్కు

**నర్సాపూర్ జూన్ 5, ప్రభాతవార్త :**
మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీతో బిఆర్ఎస్‌పార్టీ కుమ్ముక్కుఅయ్యాయని పేర్కొంటు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు దే నైతిక విజయమని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు అన్నారు. బుదవారం వారు నర్సాపూర్‌పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమాజీ మంత్రి హరీష్‌రావు తెరవెనక రాజకీయం చేసి బిజెపి పార్టీతో కుమ్ముక్కై బిజెపి పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించారని వారు ఆరోపించారు. సిద్దిపేటలో బిఆర్ఎస్ అభ్యర్థి కి లక్ష మెజార్టీ అందిస్తానని ప్రకటనలు చేసి కేవలం 2 వేల మెజార్టీ అందించడంలోఅంతర్యమేమిటని ప్రశ్నించారు. దీంతో వారు ఇరుపార్టీలు కుమ్ముకైనట్లు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు బిజెపి పార్టీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిపారు. ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీని బిజెపి లో విలీనం చేయాలని

కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి




మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి

వారు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్ నియోజకవర్గం నుండి 18 వేల ఓట్లు అందించామని అన్నారు. ఈ మెజార్టీ సాధించేందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తలకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని అన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి నీలం మదు దే నైతిక విజయమని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర నాయకులు రవిందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు శ్రీనివాస్‌గుప్త మాజీ ఎంపిపి లు లలితనర్సింగ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు మల్లేషం, నాయకులు హకీం, రుస్తుంపేట ఎంపిటిసీ అశోక్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, మండల బిసి సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రశీద్, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, నాయకులు హబీబ్‌ఖాన్, ఎద్దు మల్లేష్‌యాదవ్, రవిగౌడ్, అల్తాఫ్, శివ్వంపేట నర్సింహ్మాచారి కాంగ్రెస్ నాయకులు ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మనూర్‌లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెష్ శ్రేణులు

## మనూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**మనూర్, జూన్ 5, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌కు భారీ మెజార్టీతో ఎంపిగా విజయం సాధిచండంతో మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆనందోత్సహాలతో సంబరాలు జరుపుకున్నారు. మండలంలో కాంగ్రెస్‌కు 8629 కోట్లు, బిజెపికి 5680, బిఆర్ఎస్‌కు 3172 ఓట్లు పోవటంతో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్‌కు 2949 ఓట్ల మెజార్టీ దక్కింది. ఇదిలా ఉండగా మనూర్‌లో 24 ఓట్లు, మైకోడ్‌లో 244 ఓట్లు బిజెపికి అధిక్యం దక్కింది. సురేష్‌శెట్కార్ ఎంపిగా విజయంసాధించడంతో పార్టీ నాయకులు టపాసులు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

**నాగల్‌గిద్దలో...**



నాగల్‌గిద్దలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, జూన్ 5, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా సురేష్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌పై ఘన విజయం సాధించడంతో నాగల్‌గిద్దతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు, సురేశ్‌కుమార్ శెట్కార్ అభిమానులు ఆనందోత్సవాలతో బుధవారం సంబరాలు చేసుకున్నారు. పటాకులు కాలుస్తూ, మిఠాయిలు తినిపించుకుంటూ నృత్యాలు చేస్తూ జై కాంగ్రెస్, జై జై సురేశ్ శెట్కార్ లాంటి నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలోని దత్తాత్రి ఆలయంలో పార్టీ శ్రేణులు 101 కొబ్బరి కాయలు కొట్లి తమ మొక్కుబడిని చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, ఎంపిటిసి సభ్యులు పండరినాథ్‌రావు పాటిల్, యూత్ అధ్యక్షులు ఓంకార్ స్వామి నాయకులు అనిల్ పాటిల్, సంజీవ్ పాటిల్, సంతోష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

**హుస్నాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అంగన్‌వాడీ టీచర్ తిరుమల అన్నారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా అంగన్‌వాడీ హుస్నాబాద్ ప్రాజెక్ట్ కోహెడ సెక్టార్ సముద్రాల గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ తిరుమల పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, బాలింతలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిటిఎస్ ఆదేశాలు హుస్నాబాద్ సిడిపివో జయశ్రీ సూచనల మేరకు ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న జెఎసి కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపిన సిపిఐ, జనసమితి సభ్యులకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అప్రజాస్వామిక పద్ధతిలో బిజెపికి సహకరించిందన్నారు. బిఆర్ఎస్ బిజెపికి తొత్తుగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వీరన్ననాయక్, రాజగోపాల్‌రావు, కేడం లింగమూర్తి, లక్ష్మణ్, చందు, జయపాల్‌రెడ్డి, లక్ష్మీ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

**సిర్గాపూర్, జూన్ 5, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా సురేశ్‌కుమార్ శెట్కార్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బిబి పాటిల్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించడంతో మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ సంబరాలు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. నాయకులు టపాసులు కాలుస్తూ, నృత్యాలు చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లోవిజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు